యజమాని భార్య

నలభై ఐదు రూపాయల మీద గుమాస్తాగా చేరేడు, సంజీవరావు. అది ఒక బట్టలమిల్లులో.

యజమానితో ఇంటర్వ్యూ చేసినన్ని క్షణాలు అతని గుండె అదటుతో కొట్టుకోసాగింది. ఎందుకంటే ఉద్యోగపు ప్రయత్నంలో అతను పడినశ్రమ రాస్తే పెద్ద భారతమంతౌతుంది.

మిల్లు యజమాని సుబ్బరాయశ్రేష్టి అతని మొహం ఒకసారి పరిశీలించి చూశాడు.

"సరే. ఈవేళనించే పనిలోచేరు" అన్నాడు.

సంజీవరావుకు నెత్తిమీదినుంచి పెద్ద బరువును దింపినట్టయింది. ఒక అరగంటలో ఆర్డర్లు టైపు ఐ రావడం, అతను పనిలో చేరడం జరిగింది.

అకౌంట్సు క్లర్కుగా అతనికి పని ఇచ్చారు. కొన్ని గంటల్లోనే అతను ఫైలూ్సా, పాత రికార్డ్సూ అన్నిటినీ పరిచయం చేసుకొన్నాడు.

రెండుగంటల వేళ యజమాని కొన్ని పే బిల్సు ఇచ్చి ఒక గంటలో తప్పులు లేకుండాచూచి ఇమ్మన్నాడు.

యజమానికి చాలా సంతోషం కలిగింది. "వెరీగుడ్" అని మాత్రం అన్నాడు.

సుబ్బారాయుడు, చాలా ధనవంతుడు. అతను స్కూలు ఫైనల్ మూడుసార్లు తప్పితే తండ్రి గతిలేక వ్యాపారంలోకి దింపాడు. అతనికి వ్యాపారంలో శ్రద్ధలేక బట్టలవర్తకంలోకి

దిగి, దానిలో వొచ్చిన లాభాలతోనూ, తన సొంత ఆస్థితోనూ, తండ్రి చనిపోయాక ఒక బట్టలమిల్లు పెట్టాడు. యుద్ధపురోజుల్లో లాభాలు అతన్ని ఆకాశానికెత్తాయి. ఆ రోజుల్లోనే శ్రేష్ఠి అనే పదాన్నికూడా తన పేరుకు తగిలించుకొన్నాడు.

యజమాన్ని మొదటి దెబ్బలోనే మెప్పించ గలిగినందుకు సంజీవరావుకు చాలా గర్వం కలిగింది.

సాయంత్రం ఆఫీసునించి రాగానే కాఫీతాగి, కొంత డబ్బును హోటల్లో అడ్వాన్సుగా యిచ్చి, కొంతడబ్బుతో పళ్ళు కొన్నాడు, యజమానికి బహూకరించటానికి. ఎందుకనో అతని హృదయం ఆనందంతో వుప్పొంగసాగింది. ఎంత లేదన్నా కొన్నాళ్ళలో పనంతా నేర్చుకొని ఆకౌంటెంట్ కాలేకపోడు! అదే అతని ఆనందానికి కారణం. ఆఫీసునించి వొచ్చేటప్పుడే యజమాని ఇంటి ఎడ్రసు అడిగి వుంచాడు. పళ్ళు సంచిలో వేసుకొని తిన్నగా అటువైపు బయలుదేరాడు.

కొంతసేపటికి యజమాని యిల్లు చేరాడు. యజమాని కారు షెడ్ ఖాళీగా తెరిచేవుంది. అతనికి ముందర నిరాశ కలిగింది. కాని ఒకవేళ ఇట్లోవుండి కారు ఎక్కడికన్నా పంపాడేమోనని వీధిగుమ్మం దగ్గరకి వెళ్ళాడు. పల్చని తెర గుమ్మాన్ని కప్పుకుని వుంది. అయినా లోపలి మనుష్యుల్ని చూడ్డం కష్టం కాదు. కాని లోపలివాళ్ళకి పై మనుషులు బాగా కనపడతారు. అతడు గుమ్మందగ్గరే కొన్ని క్షణాలు సాలోచనగా నించుని చూశాడు. లోపల అయిదారు సోఫాలు వున్నాయి. ఒక సోఫావద్గర చిన్న టేబిల్ మీద రేడియో

పెడుతూ ఎవరో అందమైన స్త్రీ కూచునివుంది. అతనికి ముందుకు వెళ్ళడానికి, వెనక్కి పోవడానికి తోచక, సంకోచంలో పడి, ఏమీ చెయ్యలేదు. కొంతసేపు అట్లాగే నించున్నాడు.

లోపలి స్త్రీ రేడియో తగ్గించి "ఎవరదీ? లోపలికి రావొచ్చు" అంది. కంఠంకూడా చాలా తియ్యగా వుంది.

ఏమీతోచక సంజీవరావు లోపలికి వొచ్చి పళ్ళసంచి కిందపెట్టాడు. సంజీవరావు ఎర్రగా లేకపోయినా ముఖంలో కళ వుంది. ఏ స్త్రీ దృష్టినైనా కొన్నిక్షణాలు నిలబెట్టే సహజ సౌందర్యం అతనిలో లేకపోలేదు.

ఆ స్త్రీ కళ్ళు విప్పార్చుకుని కొన్ని క్షణాలు అతన్ని చూసింది. సంజీవరావుకు అగమ్యగోచరమైంది. ఏంమాట్లాడాలో తెలీలేదు. కళ్ళు అమాయికత్వాన్ని చూపెడుతున్నా మనసులో ఎన్నో ప్రశ్నలు పరుగెత్తాయి! ఎవరావిడ? యజమాని భార్యా? వాళ్ళల్లో కూడా ఇంత అందమైన వాళ్ళుంటారా? ధనవంతుడు కనక ఎవరినన్నా తెచ్చుకున్నాడేమో? కాని సమాధానాలు మాత్రం దొరకలేదు.

ఆవిడే అంది! "ఏమిటది? అలాకూచోండి! ఎవరు మీరు?"

సంజీవరావు భయపడుతూ ఒక సోఫా కొసని కూచుని ఇలా సమాధానాలు ఇచ్చాడు.

"నేను ఆఫీసులో కొత్తగా గుమాస్తాగా చేరేను... నా పేరు సంజీవరావు. యజమానిగారికి బహుమతిగా పళ్ళు తెచ్చాను."

అంతసేపూ అతని మాటలని వినకండానే అతన్ని చూపులతో కొరుక్కు తినసాగింది ఆవిడ.

నవ్వుతో "యజమానురాలిగారికి ఏమీ తేలా?" అంది.

సంజీవరావు దెబ్బ తిన్నట్టయ్యాడు. ఏం చెప్పాలో తెలీ లేదు.

"నేను బీదవాణ్ణి. ఇంతకంటే ఇంకేమివ్వగలను? ఇవే యజమానురాలిగారికీని."

ఆవిడ ముఖంలో నవ్వు పోలేదు. కొత్త ఆనందం తొణికిస లాడసాగింది. ఒంటిమీది నగలు, సిల్కుచీర వీధిలోంచి వొచ్చే సంధ్యాకాంతుల్ని ప్రతిఫలింప చేస్తున్నాయి. సంజీవరావుకి మూర్ఛ వెంటనే వొచ్చేలా అయింది. వెళ్ళిపోదామనుకున్నాడు. కాని సంభాషణ సగంలో ఆపిపోతే ఏంకొంప మునుగుతుందో?

ఆవిడ వయస్సు ముప్ఫై లోపు. తెల్లగా అందంగా వుంది. ఆకర్షణీయంగావుంది. కొన్నిక్షణాల నిశ్శబ్దం.

"పేదవారా? పాపం!" వింతనవ్వునవ్వింది. సంజీవరావు మనస్సులో భావాలు చెప్పడానికి మాటలు చాలవు. ఏదో స్వప్నభావంలోని పరిణామంలా మారింది ఆతని ధోరణి. మౌనంగా సౌందర్యాస్వాదన తప్ప మరేం చెయ్యలేక పోయాడు.

"డబ్బుతోనే భాగ్యవంతులౌతారా? కొందరు అందంలో, కొందరు విద్యాధిక్యతలో, మరికొందరు ఏదో లలిత కళారాధనలో— అందరూ అన్ని విధాలు!"

గట్టిగా నవ్వింది. అతనిచెవుల్లో కంచుగంటలు మోగించినట్టయింది. అర్థం చేసుకున్నట్టు చిరునవ్వు నవ్వాడు.

"యజమానిగారు వొస్తే ఇయ్యండి. నేను వొచ్చానని చెప్పక్కర్లేదు" అన్నాడు, వెళ్ళడానికి లేస్తూ.

ఆవిడ కూడా లేచింది.

"మంచిది, వెళ్ళిరండి! కాని నాకేమీ బహుమతి తేలేదని బాధపడవొద్దు. మీ రాకే నాకో బహుమతిలా వుంది" అంది. ముఖంలో నవ్వు మాత్రం తగ్గలేదు.

"మీ పేరు తెలుసుకోవొచ్చా?" అన్నాడు అతను వెళ్ళబోతూ.

"శ్రీదేవి" అంది, అదోరకంగా చీర చెంగుని కండువాలా కప్పుకుంటూ.

*　　　　*　　　　*

శ్రీదేవి నిజంగా సుబ్బరాయశ్రేష్ఠి భార్యే. అతను చిన్నతనంలో తల్లితండ్రులు చెప్పినట్టు విని పెళ్ళిచేసుకోలేదు. చాలా ఆలస్యంగా ముప్పై ఏళ్ళొచ్చాక శ్రీదేవిని వెతికి, ప్రత్యేకం ఆవిడ అందాన్ని వరించి పెళ్ళి చేసుకున్నాడు. శ్రీదేవికూడా వాళ్ళ తరగతికి చెందినదే అయినా అందాన్ని వరంగాపొంది పుట్టింది. ఆవిడ్ని చూసినవాళ్లు ఆవిడ కులం చెప్పగలగడం కష్టమైన పని. అందుకనే సంజీవరావుకి ఆవిడని చూడగానే విపరీతాలోచనలు కలిగాయి.

శ్రీదేవికి వివాహమయ్యేటప్పటికి పదిహేను సంవత్సరాలు. ఈ పదిహేనేళ్ళ వివాహజీవితం దాదాపు సంతోషమయంగానే గడిచింది. ఆవిడ మొదట చాలా బీదకుటుంబా

నికి చెందింది. కొంచెం చదువుకున్నది కూడా. సుబ్బరాయ శ్రేష్ఠితో వివాహమయ్యేముందర ఘోస్తుఫారం చదివేది. అలాంటి మనిషిని ఒక్కసారిగా ఈయన తన ప్రేమప్రవాహంతో, ఆనందసాగరంలో, తేల్చి పడవేశాడు.

సంజీవరావు వెళ్ళిపోయిన కొన్ని క్షణాలు చైతన్య విహీనై కూచుంది శ్రీదేవి. ఇంతగా తన దృక్కుల్ని తన ఆకారంలో బంధించిన పురుషుడిని శ్రీదేవి తన జీవితంలో చూళ్ళేదు.

ఏదో భర్తతో నిశ్చింతగా బతకడం తప్ప ఎప్పుడూ ప్రేమను గురించిగాని, ఇతర పురుషుల్ని గురించిగాని ఆలోచించి ఎరగదు. కాని ఈవేళ సంతోషంతో నిండిన మనస్సు ఎడతెగని ఆలోచనల్ని చెయ్యసాగింది. ఏ ఆధారం లేక సముద్రంలో ఈదే మనిషికి ఏదో తెప్ప దొరికినట్టు, అంధకారంలో మసిలే మనిషికి వెలుగు కనపడ్డట్టు, అనంతాకాశంలో ఎగిరే జీవికి వాలడానికి చోటు లభించినట్టు అయింది.

శ్రీదేవి సాధారణంగా పరాయి మొగవాళ్ళతో మాట్లాడిఎరగదు. ఇదివరకు ఎవరైనా మిల్లునించి, భర్త ఆఫీసు నించీ ఏవన్నా వార్తలు తేవడం, అప్పుడప్పుడు రావడం కద్దు. కాని ఎవరితోనైనా సరే, ముక్తసరిగా, అవసరమైనంతే మాట్లాడి పంపించేది.

సంజీవరావులోని ఏదో అసాధారణమైన ఆకర్షణ ఆవిడకి మత్తు కలిగించి అలా మాట్లాడేలా చేసింది.

ఎన్నో ఆలోచనలు ఎక్కువై ఒక్కసారిగా తలనొప్పి వొచ్చినట్టయింది శ్రీదేవికి.

"అబ్బ! ఎవడితను? ఒక సామాన్యమైన వ్యక్తికోసం ఆలోచించి నా మెదడు ఎందుకిలా కష్టపడాలి. మా ఆఫీసులో గుమాస్తాయేగా?" అనుకుంది.

అంతలోకి వీధిలో కారు హారన్ వినపడింది.

మెర్క్యురీలైట్ వెలిగించి, లేచి నించుంది. భర్త లోపలికి వచ్చాడు. రాగానే సంచి ఎదట కనపడింది.

"ఏమిటది?" అన్నాడు సోఫామీద కూచుని. శ్రీదేవి పక్క స్టూలుమీద కూచుని బూటు లేసులు విప్పసాగింది. అతను ఒక చెయ్యి శ్రీదేవి భుజంమీద వేశాడు. రెండో చేతిలో పెద్ద చుట్ట వుంది.

"ఎవరో మీ ఆఫీసులో కొత్తగుమాస్తా మీకు బహుమతిగా పండ్లు తెచ్చాడు" అంది.

"ఎవడు? పిచ్చివాడిలా వున్నాడే! ఇదేం కొత్త ఆనవాయితి? సంజీవరావా?" అన్నాడు శ్రేష్ఠి.

"పిచ్చి లేదుకాని, పిచ్చి ఎత్తించేవాడు"అని లోపల అనుకుని "అవును, అతడేఆవును" అంది పైకి.

"సంజీవరావు కాదు నా మనో సంగ్రహణరావు" అనుకుంది మళ్ళా.

సంజీవరావూ అంతే! ఆవేళటి సంఘటన యజమానురాలి ప్రవర్తన అతని మనోవీథిలో చాలా రోజులవరకూ వాటి ప్రభావాన్ని అట్టేపెట్టాయి. చాలా రోజులు ఆలోచనలతో గడిపాడు. ఆఫీసులో పనిమాత్రం బాగా చేస్తూండేవాడు. ఆ మరునాటినించి యజమాని అతన్ని ఎంతో గౌరవంగానూ, ఆదరంగానూ చూస్తూండేవాడు.

కొన్నాళ్ళకి అతనికి ఎకౌంటెంట్ పని అయింది. అతని ఆనందానికి మేర లేదు. ఒకరోజు ఉద్యోగంకోసమని రోడ్లు పట్టుకుని కాళ్ళు అరిగేలా తిరిగిన అతను ఇవాళ ఆ ఉచ్ఛస్థితి లోకి వెళ్లకలిగాడంటే అతను పొందిన ఆనందాన్ని కొలవగల గడం ఎవరి తరం?

ఆ వేళ సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వెడుతూంటే నౌఖరు ఒక చిన్న కబురు అందచేశాడు. "సాయంత్రం ఆరు గంటలకి అమ్మగారు మిమ్మల్ని కనపడమన్నారు" అని.

ఒక్కక్షణం అతనికేం పాలుపోలేదు. ఏమిటీ విశేషం?

అతను అంతా తన శక్తి సామర్థ్యాలూ, తెలివితేటల వల్లే అనుకుంటున్నాడు. కాని ఇప్పుడు అకస్మాత్తుగా తన ఉచ్ఛస్థితికి కారణం వేరేమైనా వుందా? అని అనుమానం కలిగింది. వెంటనే అది బలపడిందికూడా.

యజమాని రెండురోజుల్నుంచి వూళ్ళో లేడు. ఏదో అర్జంటు పనిమీద బొంబాయి వెళ్లాడు. వెళ్లేటప్పుడు ఆఫీసు లోని బాధ్యత తనకే చాలవరకు అప్పగించి వెళ్లాడు.

యజమాని ఇంటికి వెళ్ళేటప్పటికి శ్రీదేవి అందంగా తయారై గుమ్మందగ్గరే నించుని ఆహ్వానించింది.

సంజీవరావు లోపలికి వెళ్లాడు.

"ఎందుకు పిలిపించారు?"

శ్రీదేవి నవ్వు మొహంతో అతన్నోసారి చూసింది. అతను నించునేవున్నాడు. ఆ నవ్వులోనూ, ఆ కళ్ళ వింత చూపుల్లోనూ ఏదో బలమైన కోరిక, లోతైనభావం తోచింది అతనికి. కాని పైకేం మాట్లాడ తల్చుకోలేదు. కాని ఎట్లా

ప్రవర్తించినా అతని ఉద్యోగానికి భంగం కలుగుతుందేమో ననిపించింది.

"ఓయ్! భగవంతుడా" అనుకున్నాడు మనస్సులో.

"మరేం ఫర్వాలేదు కూచోండి. కారణం లేకుండా పిలిపించలేదు" అంది శ్రీదేవి తను కూచుంటూ. సంజీవరావు కూడా కూచున్నాడు ఓ సోఫామీద, ఓ పక్కగా.

"మీకు ప్రమోషన్ వచ్చిందిటగా" అంది శ్రీదేవి, ఓరగా అతనికేసి ఒక విధమైన ప్రేమ, గర్వం, గొప్పతనం తొణికిసలాడేలా చూస్తూ.

"అవును!" అన్నాడు అతను. ఏవిధమైన భావం అతను మాపుల్లో లేదు. శాంతంగా ఆమెవైపు చూడసాగాడు.

శ్రీదేవి మళ్ళీ అందుకుంది! అందుకనే పిలిపించాను. మీకు కొత్తగా ఉద్యోగమైనప్పుడు నాకేం బహుమతి ఇవ్వలేదు – మీ దర్శనం తప్ప. ఈ శుభసమయంలో మీకు నేను బహుమతి యివ్వదల్చుకున్నాను. ఇష్టమేనా!"

నౌకరువచ్చి విద్యుద్దీపాలు వెలిగించి వెళ్ళిపోయాడు. పైన తిరుగుతున్న ఫాన్‌లా అతని మనస్సు ఆలోచనల్ల సుడిగుండంలో పడి కొట్టుకోసాగింది. అతని కేమనాలో తెలీలేదు.

"మీదయ!" అని మాత్రం అన్నాడు.

"నడవండి, మీ యింటికి వెళదాం. డ్రైవర్" అని కేకేసింది.

సంజీవరావు చిత్తు అయ్యాడు. మనస్సు సుడిగుండంలో పడి మునుగుతుందో, తేలుతుందో తెలీలేదు. భగవంతుడి మీద భారం వేశాడు.

కారు గుమ్మంముందు ఆగింది. ఆవిడ లేచింది. సంజీవ రావుకూడా లేచేడు.

"నడవండి" అంది.

"మా యింటికి ఎందుకు ?" అన్నాడు అతను సంకోచంలో పడి.

"అంతా వుంది, చెబుతాను" శ్రీదేవి దారితీసింది.

ఇద్దరూ కారులో కూచున్నారు.

"సంజీవరావు గారింటికి పోవోయ్" అని యజమాను రాలు.

డ్రైవర్ కారుని పోనిచ్చాడు.

పది నిమిషాల్లో అతని యిల్లు చేరుకున్నారు. ఇల్లు చాలా పెద్దదే, కాని, అందులో ఐదారు అద్దెకుటుంబా లుంటు న్నాయి. మధ్య తరగతికి చెందిన మనుష్యుల్లో వుండే దారిద్ర్య భారం పై కే కనపడుతోంది. ఇంటిముందర ఆ యిళ్ల పిల్లలు ఏవో ఆటలు ఆడుకుంటున్నారు. కొందరు బట్టలు లేక, మరి కొందరు, మాసిన చిరిగిన బట్టలుతోనూ.

సంజీవరావు దిగి ఇంట్లోకి దారితీశాడు. వెనకాలే శ్రీదేవి వెళ్ళింది- అతనింట్లోకి నిజంగా లక్ష్మి వెడుతున్నట్టు. అక్కడి పిల్లలు, కారు ఆగడం, ఆవిడ లోపలికి వెళ్లటం అన్నీ ఆశ్చర్యంతో చూడసాగారు.

సంజీవరావు ఇంట్లో కుర్చీలూ ఏమీ లేవు. ఒక చిన్న పిల్ల ముందుగదిలో ఉయ్యాల్లో పడుకుని ంది. శ్రీదేవి వుయ్యాలదగ్గర నించుని, ఆ బిడ్డని ఏకదృష్టితో చూడసాగింది.

ఒక హారికేన్ లైటు వెలుగుతోంది, మధ్యన. అతను దొడ్డి గుమ్మంలోకి వెళ్ళి,

"ఏయ్, ఏయ్" అని పిల్చాడు. దొడ్లో ఎక్కడో పని చేసుకుంటోంది, ఆతని భార్య. "వొస్తున్నా," అంది మందమైన కంఠంతో.

అతను మళ్లా వీధిగదిలోకి వొచ్చి చాపవేశాడు. శ్రీదేవి పిల్లని లేపి, వొళ్ళోకి తీసుకునికూచుంది, చాపమీద.

"లక్ష్మి, ఇలారా" అన్నాడు సంజీవరావు.

అతని భార్య లోపలికి వొచ్చింది చీర చెంగుతో తడి చెయ్యి తుడుచుకుంటూ.

శ్రీదేవినీ వీధిలోని కారునీ ఆశ్చర్యంగా చూస్తోనే "నమస్కారం" అంది.

"ఆవిడ మా యజమాని భార్య! నిన్ను చూడాలని వొచ్చారు" అన్నాడు సంజీవరావు.

శ్రీదేవి లేచి ప్రతినమస్కారం చేసి,

"అవును, మీ ఆయనకి ఈవేళ ప్రమోషన్ వొచ్చిందట. అందుకని మీకేమన్నా బహుమతి ఇవ్వాలని వొచ్చాను" అంది. ఆవిడ చేతిలోని బిడ్డ, ఆవిడ ముఖంకేసి, వింతగా చూడసాగింది.

లక్ష్మికి ఇదేం అర్థంకాలేదు. కాని "ఎంత మాట!" అంది.

సంజీవరావేదో సంజ్ఞ చేసేడు. లక్ష్మి లోపలికి వెళ్ళింది.

"నిజంగా లక్ష్మే" అంది శ్రీదేవి కూచుంటో.

అతను మౌనంగా తల వొంచుకున్నాడు. ఆవిడ కళ్ళల్లో ఏదో భావం మెరియడం అతను స్పష్టంగాచూశాడు.

లక్ష్మి ఓ గాజుగ్లాసులో కాఫీ తీసుకొచ్చి, ఆవిడ కిచ్చింది.

"మీరు త్రాగరా ?" అంది శ్రీదేవి.

"ఆయన హోటల్లో తాగివొస్తారు. నాకు పట్టింపు లేదు" అంది లక్ష్మి. కాని అది సర్దడానికి అన్నమాటే ననేది, వాళ్ళ ముఖాల్లోని సిగ్గుతో కూడిన భావం దానంత టదే తెలియజేస్తోంది.

శ్రీదేవి మాట్లాడకండా కాఫీ తీసుకుంది.

"మిమ్మల్ని చూడ్డానికి చాలా సంతోషంగా వుంది" శ్రీదేవి అంది.

"మీ దయ. అప్పుడప్పుడు వొస్తూండండి. అంది లక్ష్మి.

"ఎందుకు రాను ?"

"మీ మాటే పదివేలు; అయినా చూస్తాంగా ?"

"రానూ, అమ్మాయ్, నువ్వు నిజంచెప్పు" అంది శ్రీదేవి పిల్ల మొహంమీద మొహంపెట్టి, ముద్దు పెట్టుకుంటో.

"ఉఁ! ఉఁ! ఉంగా!" అంది పిల్ల. అందరూ ఒక్క సారి నవ్వారు.

"నిజం చెప్పావమ్మా" అని తిరిగి ముద్దుపెట్టుకుంది.

"ఇదిగో, బహుమతి!" అని పిల్లని కింద కూచోపెట్టి, మెడలోంచి నెక్ లెస్ తీసి పిల్ల మెడలో వేసింది.

"ఇదేమిటి అన్యాయం ?" అంది లక్ష్మి.

"మీ దయ చాలు. మాకివేం వొద్దు" అన్నాడు సంజీవరావు.

శ్రీదేవి వినలేదు. వెంటనే లేచి, "ఇక వెళ్ళొస్తా"నంది సగర్వంగా.

వాళ్లు తెల్లబోయి లేచారు.

"ఇదేం బావుండలేదు" పిల్ల మెళ్ళో గొలుసు తీయబోయాడు సంజీవరావు.

"నామీద వొట్టు" అంది శ్రీదేవి.

ఇద్దరూ నిశ్చేష్టులయ్యారు,

శ్రీదేవి కారులో కూచుంది.

లక్ష్మి పిల్ల నెత్తుకుని గుమ్మంలో నించుంది. సంజీవరావు కారుదగ్గరికి వెళ్ళాడు.

"అన్నట్టు నాకు టైం లేదు. మీరు ఆనక ఓ శేరు ద్రాక్షపళ్ళు తెచ్చిపెడతారా?" అంది శ్రీదేవి.

"అంతకంటేనా? ఇదేం ఘనకార్యమని" అన్నాడు సంజీవరావు.

కారు వెళ్ళిపోయింది.

♦ ♦ ♦ ♦

అప్పటికి రాత్రి ఎనిమిదైంది.

"భోజనానికి లేవండి" అంది లక్ష్మి. సంజీవరావు బట్టలు మార్చుకుని, కాళ్లు కడుక్కుని అన్నానికి లేచాడు.

భోజనాలు అయ్యేంతసేపూ వాళ్లదే వింతగా మరీమరీ తర్కించుకోసాగారు. చివరికి ఈ నిర్ణయానికి వొచ్చారు:

"లక్షాధికారులకి ఓ అయిదారు వందలు లెఖ్ఖా."

భోజనాలు అయ్యాక భార్య ద్రాక్షపళ్లసంగతి జ్ఞాపకం చేసింది.

అతను వెంటనే బజారుకివెళ్లి, ఓ శేరు పళ్ళుతీసుకుని, యజమానింటికి బయలు దేరాడు.

ఆ యిల్లు చేరేటప్పటికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. శ్రీదేవి తెల్లని దుస్తుల్తో, అందమైన నగల్తో ఓ అప్సరసలా తయారయి వుంది.

తను పళ్లుతీసుకుని లోపలికి ప్రవేశించాడు.

"వొచ్చారా? రారేమో ననుకున్నాను"

"ఎందుకు రాను?" అతని కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి.

"ఆ మాత్రం ప్రేమవుంటే నేను ధన్యురాల్నే"

ఈ మాటలు అతనికి అర్థం కాలేదు. అందుకని మౌనం వహించాడు.

"ఏం ద్రాక్షపళ్ళు తెచ్చారు?"

"నల్లద్రాక్ష"

"అవెందుకు తెచ్చారు?" కోపంగా అంది.

"ఇవే తియ్యగా వుంటాయి?" అన్నాడు భయంగా.

"పచ్చద్రాక్షా?"

"పుల్లగా వుంటాయి"

"ఎర్రద్రాక్ష?" ఫక్కున నవ్వింది.

అతను మాట్లాడలేదు.

"ఏం చెప్పరేం?"

"నేను వాటిని చూళ్ళేదు" అన్నాడు.

"ఇవిగో చూడండీ, రుచిచూచి, ఎలావున్నాయో చెప్పండి"

దగ్గరగా వొచ్చి నించుని, పెదమిల్ని చూపించింది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాల ఎగపుల్లో ఆవిడ వక్షం తనకి తగుల్తుం దేమోననే భయం కలిగేంత దగ్గరగా నించుంది.

ఇప్పటికి సంజీవరావుకి కథ అర్థం అయింది. ఇలాంటి కథలు అతను చాలా విన్నాడు, కాని అది ఎవరో అదృష్టవం తుల సంగతి అనుకొన్నాడు. ఇలా నవలాత్మకమైన సంఘటన మాదిరిగా జరుగుతుందని అతను అనుకోలేదు. ఒక క్షణం సందిగ్ధంలో పడ్డాడు. ఏమి చేసినా భావి చెడనూ వొచ్చు, అదృష్టం పట్టనూ వొచ్చు. ఒక్కసారి భార్య గుర్తుకు వొచ్చింది. మనస్సులో అంతఃకలహం చెలరేగింది.

శ్రీదేవి అతని కళ్లలోకి తీవ్రంగా చూడసాగింది.

"లక్ష్మివే నువ్వు" బలంగా దగ్గరికి తీసుకున్నాడు. శ్రీదేవి తన్మయత్వం చెందింది........

* * *

సుబ్బరాయశ్రేష్ఠి ఓదుర్యాత్రతో బొంబాయినించి వొచ్చాడు. అతనికి ఏదో కారు ప్రమాదంలో నడుం విరిగింది. టెలిగ్రాం వొస్తే సంజీవరావు, శ్రీదేవి స్వయంగా వెళ్ళి, బొంబాయినించి అతన్ని తీసుకొచ్చారు, ఫస్టుక్లాసులో.

ఇంటికొచ్చిన కొన్నాళ్ళకి సుబ్బారాయుడు సంజీవ రావుకే మేనేజరు పనియిచ్చి, మిల్ మేనేజ్‌మెంట్ అంతా అతనిచేతిలో పెట్టాడు. సంజీవరావు బాధ్యతనంతా స్వీకరిం చాడు. కాని నమ్మకద్రోహం చేసేంత మూర్ఖుడవదల్చుకో లేదు.

శ్రీ సుబ్బారాయుడు పడకకుర్చీమీదనుంచి లేవలేదు. అక్కడే ఎప్పుడూ వుండి, మిల్లు పనులు స్వయంగా సంజీవరావుని పిలిపించి చూస్తుండేవాడు.

శ్రీదేవికీ ఒక విధంగా బాధ వున్నా ఒకవిధంగా పెద్ద అడ్డంకు తీరినట్లయింది.

సంజీవరావుతో ప్రేమ కలాపాలు నిర్విఘ్నంగా సాగే ఏర్పాటులన్నీ చేసుకుంది. శ్రీదేవి ప్రియలక్ష్మిరూపంలో సంజీవరావు ఇంటికి ప్రవహించ సాగింది.

కొన్నాళ్ళల్లోనే అతను కారుకొని పెద్దయిల్లు అద్దెకి తీసుకున్నాడు. ఈ సంగతి లక్ష్మి కనిపెట్టక పోలేదు. కాని భర్తదగ్గర నోరెత్తే ధైర్యంలేదు.

అయినా అక్కడికీ అంది:

"మీరు రోజురోజుకీ మారిపోతున్నారు."

"ఏం చెయ్యమంటావు? అదృష్టాన్ని కాలతన్నమంటావా? దరిద్రంలోనే బతకాలని వుందా?"

లక్ష్మి బదులు పలకలేకపోయింది. పైపై సుఖాలు ఎంతగావున్నా, భర్తని పోగొట్టుకున్నాననే బాధ ఆమెలో పోలేదు.

మళ్లీ కొన్నాళ్ళు పోయాక ఈ సంఘటన జరిగింది. సంజీవరావు భోజనం చేస్తున్నాడు ఓ రాత్రివూట. లక్ష్మి అంది: "మనకీ అదృష్టం చాలు."

"నీ ఉద్దేశం?"

చాలా రోజుల్నించి సహిస్తున్నాను. ఇంక ఆ శ్రీదేవి జోలి మనకు వద్దు. ఈమాత్రం అదృష్టం మనకి చాలు. కావలిస్తే ఆవిడకి కృతజ్ఞులంగా వుందాం. నా అభ్యంతరం లేదు.”

సంజీవరావు మాట్లాడలేదు. భోజనమై కంచంలో చెయ్యి కడుక్కొని లేవబోయాడు.

“ఏం మాట్లాడకండా లేస్తున్నారు?”

“ఏం చెప్పను? నీలో ఎప్పుడూ లేని ఈర్ష్య పుట్టిం దేమిటా? అని ఆలోచిస్తున్నాను. ఆడాళ్ళు ఈర్ష్యకు లోను కాకూడదు. ఈర్ష్యని జయించినవాళ్ళు అమరత్వాన్ని సమీపిస్తారన్నమాట.”

లక్ష్మి కళ్లలో నీళ్ళు నిండాయి.

“ఈర్ష్యకాదు. కాని నా జీవితం? మీరు ప్రేమించినట్లు ఆవిడని ప్రేమించమంటే నేనూ ప్రేమిస్తాను, గౌరవిస్తాను, కాని ఆవిడతో సంబంధం నాకు ఇకమీదట బాగులేదు.” అని ఖచ్చితంగా చెప్పింది.

సంజీవరావు లేచి బట్టలు మార్చుకున్నాడు.

“వెడతారన్న మాట.”

“నీ మాటలకి బదులు చెప్పటం కష్టం.”

“ఈ జీవితాన్ని భరించడం నాకు కష్టం అవుతోంది. లోకం నోరు ముయ్యడానికి మూకుడుందా? నాకు ఇంక ఓపిక లేదు. మిమ్మల్ని, మీ గౌరవాన్నీ సంరక్షించుకోడానికి అర్ధాంగినైన నాకు హక్కు వుంది”

లక్ష్మి గుమ్మానికి అడ్డు వెళ్లింది.

“ఏమిటిది, లక్ష్మీ” అన్నాడు సంజీవరావు.

"ఈవేళకి తప్పుకో! తర్వాత అంతా చెబుతాను"

గోడగడియారం తొమ్మిది కొట్టింది.

"వీల్లేదు" గుడ్ల నీరు నింపుకునే అంది.

"లక్ష్మి?" గట్టిగా అరిచాడు సంజీవరావు.

"తప్పుకో!" గద్దించాడు.

"వీల్లేదు. వీల్లేదు. వీల్లేదు." రెట్టించి అంది, గొంతు జీరపోయేలా.

"స్టుపిడ్, గెటవుట్" అని పక్కకి తోసి వెళ్ళిపోయాడు సంజీవరావు. లక్ష్మి కింద పడిపోయింది. బద్దలైన చేతుల గాజుల ముక్కలు గదంతా చెల్లా చెదరు అయ్యాయి. బూట్ల చప్పుడు క్రమంగా అంతర్థానమైంది! తర్వాత కారు ధ్వని.

లక్ష్మికి దుఃఖం ఒక్కసారిగా పొర్లివొచ్చింది.

"అమ్మా!" అని చేతుల్లోకి ముఖం తీసుకుని వెక్కి వెక్కి యేడవ సాగింది.

"అమ్మా!"అంటూ కెవ్వున నిద్దట్లో కేక వేసి కూతురు లేచింది. తల్లి దగ్గరకొచ్చింది.

"ఏడవకే అమ్మా" అని కళ్లనీళ్ళు తుడవసాగింది, చిన్న చేతివేళ్లతో.

* * *

సుబ్బరాయశ్రేష్ఠి శారీరకంగానూ, మానసికంగానూ కూడా క్రమంగా నీరసించిపోయాడు. తన అంత్యదశ సమీపించినట్టు ఎప్పుడో తెలుసుకున్నాడు. శ్రీదేవి ఈప్రవర్తనని కూడా అతను గమనించకపోలేదు. ఓ రోజు ఇలా జరిగింది:

అతను మామూలుగా తన పక్కమీద పడుకున్నాడు. పక్కన శ్రీదేవి మంచంవుంది. అతనికి నడుం విరిగిన నాటినించి సాంసారిక జీవితాన్ని బలవంతంగా విసర్జించవలసి వొచ్చింది. ఎప్పుడూ, మంచంమీదగాని, పడకకుర్చీలోగాని వెల్లకిలా పడుకునే వుండాలి. పక్కలకి తిరగడానికి కూడా వీలు లేకపోతోంది.

ఆరోజు రాత్రి మూడుగంటలవేళ మెలుకువ వొచ్చింది. రాత్రి గాలి మెల్లగా సంగీతాన్ని పాడుతో వీస్తోంది. ఆకుపచ్చని బల్బు కాంతి దోమతెరని చించుకుని లోపలికివొస్తోంది. ఆ వెలుతురులోనే మెడ పక్కకి తిప్పి శ్రీదేవి పక్కకేసి చూశాడు. కాని అది శూన్యంగా కనపడింది. మళ్ళీ రెండు మూడుసార్లు చూశాడు. కాని మొదట చూసింది నిజమే అయింది.

"శ్రీదేవీ..." మెల్లిగా పిలిచాడు. కాని బదులు రాలేదు. అతనికేమీ తోచలేదు. శ్రీదేవి అన్నాళ్లూ అతనికి తెలియనంతగా తన ప్రవర్తనని దాచిపెట్టింది. ఎక్కడికైనా వెళ్ళిందేమోనని అతననుకున్నాడు. తర్వాత నిద్దర పట్టలేదు. అరగంటపైగా గడిచింది. శ్రీదేవి రాలేదు. అతని మనస్సు ఎంతో ఆందోళన పడసాగింది. ఏవేవో ఆలోచనలు తోచాయి. తన జీవితాన్నంతటినీ తల్చుకున్నాడు. సంఘంలో తను ఈ ఉన్నతస్థానం పొందడానికి పడినశ్రమా, బాధా అన్నీని. తర్వాత శ్రీదేవితోటి తన జీవితాన్ని మొదటినించి తల్చుకున్నాడు. కళ్ళు ఆనందబాష్పాల్తో నిండాయి. అవే కొన్ని క్షణాల్లో దుఃఖాశ్రువులుగా మారాయి. ఒక్కొక్క

బాష్పబిందువే అతని మాసినగెడ్డంలోంచి నెమ్మదిగా జారి పక్కమీద పడసాగింది.

కాకులు కూతలు ప్రారంభించాయి. ఆలోచనల్తోనూ, బాధతోనూ ఆతనికి చాలా అలసట కలిగింది.

గడియారం ఐదు కొట్టింది. శ్రీదేవి కిందినించి మేడ మీదికి వొచ్చింది. చేతుల గాజులూ, కాళ్ళ కడియాల అడుగున వరుసగా కట్టిన చిన్న మువ్వల గలగలధ్వనీ ఆమె ఎంత నిశ్శబ్దంగా వొద్దామన్నా, ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని కొంచెంగా వినపడసాగాయి. నెమ్మదిగా వొచ్చి తన పక్కని ఆక్రమించుకుంది.

"శ్రీదేవీ" అని నెమ్మదిగా పిల్చాడు. శ్రీదేవి ఉలిక్కిపడింది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. చాలా ఆశ్చర్య పడింది. ఏమిటిది? కాని ఓ క్షణంలోనే కోలుకొంది.

అతను "శ్రీదేవీ..." అన్నాడు మళ్ళీ.

"ఎవరూ! మీరా?" అంది అతనివైపు దొర్లి.

"అవును; నేనే!"

"ఏం నిద్దర రావడంలేదా?"

"లేదు; నువ్వు ఇందాకటినించి ఎక్కడికి వెళ్ళావ్."

శ్రీదేవి మాట్లాడ్లేదు.

"అప్పుడే రెండు గంటలైంది, మెలుకువవొచ్చి నిన్ను పిలుస్తే పిలుపులు గాలిలో కలిసిపోయాయి. ఇంతసేపూ ఎక్కడ వున్నావ్?" చాలా నెమ్మదిగానూ, జాలికరంగానూ, స్పష్టంగానూ మాట్లాడాడు.

"కిందికి వెళ్ళాను. ఏం? ఏం కావాలి మీకు" శ్రీదేవి బదులు చెప్పింది.

"నన్ను మోసం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యకు శ్రీదేవీ. అది నీ అందానికీ, స్వభావానికీ తగినదికాదు. నువ్వు నన్నెరుగుదువు. నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకూ తెలుసు. నిజం చెప్పు. నాకదే శాంతినిస్తుంది. నేను ఎంతటి నిజాన్నైనా భరిస్తానుగాని, అబద్ధాన్నీ, ద్రోహాన్నీ సహించలేను."

నిశ్శబ్ద క్షణాలు కొన్ని గడిచాయి.

శ్రీదేవి మానసిక పరిస్థితినిగురించి చెప్పగలగడం కష్టం. సంజీవరావులోని ఆకర్షణేదో శ్రీదేవిని తనవైపు లాక్కుంది గాని ఆవిడకి సుబ్బారాయుడిని ద్రోహం చెయ్యాలనే తలంపు ఎప్పుడూ లేదు. అతనిమీద ప్రేమ మారలేదు. అతని ప్రస్తుత పరిస్థితినిబట్టి ప్రేమ ఎక్కువైంది. అందుకనే తన రహస్య జీవితాన్ని ఇన్నాళ్లూ కనిపెట్టలేనంతగా ఎక్కువ సేవచేసి, అతన్ని మెప్పించ కలిగింది. కాని లోపల ఒక భయం లేకపోలేదు. సామాన్య మనుషుల్లో ఉండే ఈర్ష్య, అసహనం, స్త్రీనిగురించిన భావాలు అతన్ని బలిగొని నిజాన్ని తెలుసుకున్నా అతన్ని అధోగతిలోకి దారితీస్తాయేమో అనే భయం లేకపోలేదు. అందుకనే చాలా జాగ్రత్తగా ప్రవర్తించింది. సంజీవరావూ అంతే! తన ఈ ప్రేమ జీవితాన్ని చాలా రహస్యంగా గడిపాడు. ఒక్క లక్ష్మమ్మ తప్ప ఎవరికీ తెలీదు. ఆవిడ నోరుకూడ కట్టివేయబడింది.

"ఏం శ్రీదేవీ, మాట్లాడవేం?" అన్నాడు మళ్ళా.

అతని జాలిగొంతుకని చూసి, తన ప్రవర్తనని చూసుకొని, ఒక రకమైన సిగ్గూ, కించిభావం కలిగి, అవమానంతో కళ్ళలో నీళ్లు తిరిగాయి. ఏం చెప్పాలో తెలీలేదు. కాని ఎప్పుడూ లేంది, అతనిదగ్గర అబద్ధం ఆడలేక పోయింది. ఆ ప్రయత్నం దానంతట అదే చచ్చిపోయింది.

"మీకు ద్రోహం చేస్తున్నాను. పాపిని అంది. రుద్ధ కంఠంతో. తలగడలోకి ముఖాన్నిదూర్చి, వెక్కి వెక్కి ఏడవ సాగింది, ఎవరో కొట్టినట్టు. అతను చెయ్యిజాచి "ఇటు రా శ్రీదేవీ. ఏమిటది? అసలు సంగతి చెప్పవేం?" అన్నాడు.

శ్రీదేవి అతని పక్కమీదికి వెళ్లి, పక్కన పడుకుంది. అతను ఒకచేత్తో మెల్లగా తట్టసాగాడు.

ఏమిటిది? ఏం జరిగింది? మళ్ళీ అడిగాడు.

నేను మీకు ద్రోహం తలపెట్టాను.

"ఏమిటది, శ్రీదేవీ ?"

"నేను చెడిపోయాను, మీదాన్ని మాత్రమే కాదు."

"ఆఁ ఏమిటి అంటున్నావు ? ఎవడా దుర్మార్గుడు. రేపే వాడి పని పడదాం"

"నా అధః పతనానికి ఎవరూ కారణం కాదు. నేనే అంతా చేసుకున్నాను. మిమ్మల్నేకాక వేరొకర్ని మనస్సులో ప్రేమించి చోటు యిచ్చాను. అందుకు నన్నేంచేసినా సరే, నేను సిద్ధమే. వాళ్ళనిమాత్రం శిక్షించడానికి వీల్లేదు"

"అల్లాగేలే ! ఎవరది ముందు చెప్పు ?"

"సంజీవరావుని కూడా ప్రేమించాను"

"సంజీవరావు". గుండెలు జల్లుమన్నాయి. మళ్లీ రెట్టించాడు. కాని చెవుల్ని నమ్మలేక పోయాడు. ఏమిటి? అంతా కలా? నిజమా? తను అసలు జీవించి వున్నాడా? ఇదే లోకం?

బాగా తెల్లారింది. తూర్పు పక్కనించి ఎర్రని వెలుగులు వీళ్లమీద పడుతున్నాయి.

శ్రీదేవి శిక్షని ఎదురు చూస్తున్న నేరస్తురాలిలా, భావరహితంగా చూస్తోంది.

"నువ్వూ సాధారణమైన మనిషివే నన్నమాట. ఎవరినేమనడానికి ఏముంది? అంతా నా దురదృష్టం, ఈ ప్రమాదం అదీని. నువ్వూ సాధారణమైన మనిషివే" తనలో తనే గొణుక్కుంటున్నట్టు అన్నాడు.

ఆరోజు తొమ్మిదిగంటలకే శ్రేష్ఠి సంజీవరావు కోసం కబురు పంపించాడు. సంజీవరావు ఏం కొంపమునిగిందోనని వెంటనే వొచ్చాడు. సుబ్బారాయుడు పడక కుర్చీమీద కూచునివున్నాడు. చేతిలో పెద్ద లంక పొగాకు చుట్టవుంది.

''రమ్మన్నారా'' అన్నాడు సంజీవరావు మామూలుగా నిలబడే.

''రా, తమ్ముడూ కూచో" అన్నాడు సుబ్బారాయుడు. ఈ కొత్తరకమైన పిలుపు అతన్ని నిశ్చేష్టుణ్ణి చేసింది. ఆశ్చర్యంతో చూడసాగాడు.

"ఏం కొత్తగావుందా, అలా పిలవడం? నాకు కథంతా తెలిసింది. చాలా అదృష్టవంతుడివి. శ్రీదేవి ప్రేమని పొందడం అదో వరం. నేను ప్రేమించి ఆవిడ ప్రేమని పొందాలని

చూచాను. కాని నీకు అనాయాచితంగా ఆవిడ ప్రేమదొరక డం చాలా అదృష్టం. నా దృష్టిలో శ్రీదేవో దేవకాంత.

అతని కళ్ళు చెమ్మగిల్లాయి. సంజీవరావు తీక్షణ వీక్ష ణాల్తో నేలని చీలుస్తున్నాడు.

శ్రీదేవి రెండు కప్పుల్లో, కాఫీ తెచ్చి అక్కడపెట్టింది. తర్వాత నెమ్మదిగా వొరిగి భర్త పాదధూళి తీసుకుని కళ్ళకు అద్దుకుంది. సంజీవరావుకు దూరంనుంచే నమస్కరించింది.

సంజీవరావుకి అంతా అగమ్యగోచరంగా వుంది. ఏమిటీ విశాలాంతఃకరణ? ఎవరన్నా ఇల్లా క్షమిస్తారా? అతను కోప గిస్తే ఈపాటికి డిస్మిస్ చేసి, నేలని రాసి పారవెయ్యవొచ్చే? ఎలా క్షమించాడు ఇద్దర్నీ? ఇలాంటి మనుష్యులు కూడా లోకంలో వుంటారన్నమాట. అతని మంచే తనకి పెద్ద శిక్షై నట్టు బాధ పడసాగాడు.

చివరికి "ఇవాళ నేను విల్లురాయాలి. అందుకు తగిన ఏర్పాటులన్నీ చెయ్యండి" అన్నాడు శ్రేష్ఠి.

* * *

సంజీవరావు ఇంటిముందర కారు ఆగి యజమాని మరణవార్త చెప్పింది. సంజీవరావు సంసారంతో కూడా బయలు దేరాడు.

సుబ్బారాయుడు గుండె ఆగి మరణంచాడు. శ్రీదేవి గుండె పగిలేలా ఏడుస్తోంది. లక్ష్మి వెళ్ళి శ్రీదేవిని ఓదార్చ సాగింది. కొన్ని నిమిషాల్లోనే మిల్ జనం అంతా అక్కడ చేరారు. అందరూ అన్నివిధాల శ్రేష్ఠి గొప్పతనాన్ని పొగడ మొదలుపెట్టారు. అతను కట్టించిన సత్రాలు, నిలపెట్టిన

కుటుంబాలు, వాళ్ళ కులంలో చదువుకునే విద్యార్థుల కిస్తున్న స్కాలర్ షిప్‌లు అన్నీని.

సంజీవరావు మిల్లుకి సెలవు ప్రకటించి దహనక్రియల ఏర్పాట్లు చెయ్యసాగాడు.

పెద్ద వూరేగింపుతో, మర్యాదతో అంత్యక్రియలు జరపబడ్డాయి.

సుబ్బరాయ శ్రేష్టి తన మిల్లూ, ఇల్లూ సర్వహక్కులతో భార్యకి ఇచ్చాడు. సంజీవరావును శాశ్వతమైన మేనేజరుగా నియమించాడు. తక్కిన కొంత ఆస్థి దాన ధర్మాలకి, మిగిలింది తక్కిన దగ్గర చుట్టాలకీ ఇచ్చాడు.

అతను చనిపోయిన నాటినించీ సంజీవరావుని కుటుంబంతో సహా తనింటిలోనే వుండమంది శ్రీదేవి. వాళ్లు అంగీకరించక తప్పలేదు.

కాని శ్రీదేవి ఇదివరకటి మాదిరిగా లేదు. నగలన్నీ తీసివేసింది. తెల్లని సాధారణమైన చీరనే ధరించసాగింది. తిండికూడా తినడంలేదు. సంజీవరావుమీద ప్రేమకూడా ఇదివరకులా లేదు. అంతా ఆధ్యాత్మికంగా మారినట్టయింది. ఎప్పుడూ ఆలోచనలతోనే వుంటుంది.

ఇదంతా సంజీవరావుకి అర్థం కాలేదు. ఆవిడకి పిచ్చి ఎక్కుతుందేమో అనే భయం కలిగింది.

* * *

ఒకనాడు ఏడుగంటలవేళ కాఫీ అయి అందరూ కూచున్నారు. మామూలుగా శ్రీదేవి రేడియో పక్కని కూచుంది. రేడియోనించి వచ్చే వార్తల్ని ఆపింది శ్రీదేవి, అకస్మాత్తుగా.

అందరూ ఒక్కసారిగా ఆవిడవైపు చూశారు—ఈవిడేం వార్త చెబుతుందా ? అని.

శ్రీదేవి వయస్సుమళ్ళిన ముత్తైదువులా వుంది. జుట్టు అదోమాదిరిగా ముడివేసుకుంది. వొంటిని నగలేమీ లేవు. తెల్లని అంచులేని సిల్కుచీర కట్టుకుంది. చేతుల్ని ఓ జత గాజులున్నాయి అంతే. ఒక క్షణం తీక్షణంగా చూసింది. గొంతు సర్దుకుంది.

"మీతో యిన్నాళ్ళుగల పరిచయానికి చాలా ధన్యవాదాలు. మానవులు ఏదో పూర్వజన్మ సుకృతంవల్లగాని ఇలాంటి పరిచయ భాగ్యాల్ని పొందరు.

"ఎందువల్లోగాని నా హృదయం ప్రతిఫలం ఎరుగని ప్రేమతో నిండివుంది. మొదట ప్రేమించింది ఆయన్ని. ఆయన్ని తర్వాత నా హృదయాన్ని చీల్చుకుని ప్రవేశించింది మీరు.

"దీన్ని అందరూ అన్నివిధాలా అనుకోవచ్చును. నీచమైన కథకింద అనుకోవచ్చును. లేకపోతే తుచ్ఛమైన కామం కింద జమకట్టనూవొచ్చు. కాని నాదృష్టిలో ఇంతకంటె పవిత్రమైన ప్రేమ కనుపించడంలేదు.

"మొదటి చూపులోనే ప్రేమ అనేది అబద్ధం అని నా నమ్మకం. దానికి అర్థంలేదు. తర్వాత ప్రేమ ఒక్కసారిగా ఉట్టిపడుతుందనే వాదనకూడా నా నమ్మకాన్ని పొందలేదు.

"నన్నడుగుతే మోక్షానికి భక్తి ఎలాసాధకమార్గమో, ప్రేమకి కూడా కామంఅంతే. అందువల్లె స్త్రీ పురుషులు అంత సన్నిహితులు అవుతారు. మిగతా వ్యక్తులు ఎంత

స్నేహితం పొందినా వాళ్ళ హృదయాలు అంత సన్నిహితం కాలేవు.

"పైగా ఒక స్త్రీ ఇద్దరు పురుషుల్ని సహజంగా ప్రేమించ గలగడం మీద మీకు అపనమ్మకం వుంటే దాన్ని వొదులు కోండి. నేను మిమ్మల్నీ, ఆయన్నీ కూడా అదే ప్రేమలో ఇప్పటికీ ప్రేమిస్తున్నాను. అది అసాధ్యంకాదు. ఎక్కడైనా అది అసంభవం అయితే అది సాధారణంగా పురుషుల్లో వుండే నీచత్వం, జుగుప్స, ఈర్ష్య, అసహనం, అసూయలవల్లే కాని స్త్రీ తప్పువల్ల కాదు.

"ఇంతకీ నేచెప్పేది, ఇవాళతో నేను మీనించి దూరమవుతాను. అది నా తుదినిర్ణయం. ఇదిగో ఈ కాగితం. దీనితో నా ఆస్తిమీదవున్న సర్వహక్కులూ పోతాయి.

"నా కోరికేంలేదు. సాయంత్రం రైల్లో నాకు కాశీ వరకూ టికెట్‌కొని మనస్ఫూర్తిగా పంపించండి. అదే నా కోరిక. మిమ్మల్నీ, చెల్లినీ మళ్ళీకలవను.

"కాని వేరేలోకమనేది వుంటే..."

గొంతు పొడారిపోయి, మాటే రాలేదు. కళ్ళు తడిశాయి. లక్ష్మి, సంజీవరావు, తెల్లబోయి మాటలు వినసాగారు.

వాళ్ళు ఎంతచెప్పినా శ్రీదేవి నిర్ణయం మార్చుకో లేదు. ఆవేళ అక్కణ్ణించి కదిలింది. మళ్ళీ ఏమైందో తెలీదు.

సంజీవరావు కూతురికి "శ్రీదేవి" అని, ఆ మిల్సులోని గుడ్డలకి శ్రీదేవీ ఫాబ్రిక్స్ అని పేరు పెట్టాడు.

—(•)—